ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 27-07-2026 **సమయం : 6.45 గంటలు**

ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, విజయనగరం జిల్లాలలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు.

2. రాష్ట్ర వ్యాప్తంగా చిత్తడి నేలల గుర్తింపు, పరిరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

3. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు.

4. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పంటల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు.

==========

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, విజయనగరం జిల్లాలలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రశంసించారు 'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నీటి సంరక్షణ చర్యలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమని ప్రధానమంత్రి తెలుపుతూ..

వాయిస్ ..30.. సెకన్లు

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చిత్తడి నేలల గుర్తింపు, పరిరక్షణ చర్యలను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చిత్తడి నేలల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రంలో 950 చిత్తడి నేలలను గుర్తించినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. చిత్తడి నేలల పరిరక్షణతో జీవ వైవిధ్య సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వరదల నియంత్రణ, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర బొగ్గు,

గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో నూతన రైల్వే స్టేషన్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. 2028 నాటికి ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడకు రైల్వే స్టేషన్ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 340 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు, 576 కిలోమీటర్ల డబ్లింగ్ పనులు, 2 వేల 34 కిలోమీటర్ల విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలోని 42 రైల్వే స్టేషన్లను అత్యాధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు.

ఆంధ్రప్రదేశ్ లోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు నిర్ణీత గడువుకంటే ముందే పూర్తయ్యాయని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. విజయనగరంలోని భోగాపురం విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 1వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆయన నిన్న పరిశీలించారు. ఈ విమానాశ్రయం ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు దోహదపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ..

వాయిస్ ..25.. సెకన్లు

దేశ సరిహద్దుల రక్షణ కోసం పోరాడిన కార్గిల్ అమరవీరుల త్యాగాలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జిల్లా బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కాగడాల ర్యాలీలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో విశిష్ట సేవలందించిన మాజీ సైనికులను కేంద్ర మంత్రి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ ప్రజల భద్రత జవానుల త్యాగ ఫలితమేనని పేర్కొన్నారు. అమర జవానుల స్ఫూర్తితో యువత నవభారత నిర్మాణానికి అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లోని రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని శివగంగ, బొబ్బిలి వాగులకు చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా సాగు నీటి కాలువల వ్యవస్థను ఆధునీకరించేందుకు నిధులు కేటాయిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లో లోటు వర్షపాతం, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలను రక్షించేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోటు వర్షపాతం నేపథ్యంలో పంటల రక్షణ, నేలలో తేమ సంరక్షణ,

ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర విత్తనాల అందుబాటు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులకు వాతావరణం, పంటలపై రేడియో, టెలివిజన్, రైతు సేవా కేంద్రాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఉపయోపడేలా ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం 2 వేల 278.14 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతి మంజూరు చేసిందని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. భూసేకరణతో పాటు రహదారుల మళ్లింపు, విద్యుత్ లైన్ల తరలింపు, మిషన్ భగీరథ పైప్‌లైన్ల మార్పు వంటి అనుబంధ పనులకు కూడా నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుతో ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. భూసేకరణ, మౌలిక వసతుల మార్పిడి పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభాపతులు సి.హెచ్. అయ్యన్న పాత్రుడు, గడ్డం ప్రసాద్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ఉప శాసనసభాపతి రఘురామకృష్ణరాజుతో కలిసి నిన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి తీసుకొచ్చిన స్వర్ణ బోనాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె, బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడం సంతోషకరమన్నారు. తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో కనకదుర్గమ్మ దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఎల్‌నినో ప్రభావం నుంచి తెలుగు రాష్ట్రాలను కాపాడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది వాయువ్య దిశగా కదులుతూ, తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రంతెలిపింది.

==========